క్లుప్తంగా

పుస్తకం హస్త భూషణం



కవి సమ్మేళనానికి హాజరైన ఉపాధ్యాయులు, అధికారులు

శ్రీకాళహస్తి : పుస్తకం హస్త భూషణమని పలువురు కవులు అన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, కవులు కయ్యూరు బాల సుబ్రహ్మణ్యం, పెల్లకూరు మునిసుబ్బారెడ్డి, పులివర్తి గురునాథం, సులోచనదేవి తమ కవితలను వినిపించారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మూలస్థానేశ్వరునికి అన్నాభిషేకం

రేణిగుంట : మండలంలోని గాజులమండ్యంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మూడో కార్తీక సోమవారం సందర్భంగా అన్నాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు జువ్వల ధనుంజయరెడ్డి తెలిపారు. మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, కార్తీక మాసంలో మూడో సోమవారం అన్నాభిషేక మహోత్సవం ఎంతో వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ కార్తీక మూడో సోమవారం భక్తుల చేతుల మీదుగా పెద్ద ఎత్తున అన్నాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల దర్శనానంతరం ఆ ఆహారాన్ని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తారని తెలిపారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



ర్యాలీలో కరపత్రాలతో స్కౌట్ విద్యార్థులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ బేడన్ పావెల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నాలుగు మాడ వీధుల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న ప్పటి నుంచే క్రమశిక్షణ అలవరచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో తనాజ్, సాయికిరణ్, రామ్‌సాయి పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న విప్ బొల్లిశెట్టి శ్రీనివాస్



ఆలయం వద్ద రాష్ట్ర విప్ బొల్లిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర విప్, తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం



కార్తీక దీపాన్ని ఎగురవేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాదీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని ప్రతిరోజు ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తున్నారు. ఆలయంలోని ఊంజల్‌సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

సత్యవేడుకు ఫీవర్



ఓ ప్రైవేటు ఆర్‌ఎంపీ వైద్యశాలలో జ్వర బాధితురాలికి వైద్యం

మారిన వాతావరణం.. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు.. దీనికి తోడు గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యంతో గ్రామీణ ప్రాంత ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి ఇంటా జ్వర బాధితులే అధికంగా ఉన్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వర బాధితులు వరుస కడుతున్నారు. ప్రధానంగా జ్వరాలతో ఆర్‌ఎంపీ వైద్యుల పంట పండుతోంది. ప్రాథమిక వైద్యం చేయాల్సిన వీరు ఏకంగా ఎంబీబీఎస్‌లకు మించి వైద్యం చేస్తున్నారు. నాలుగు రోజులుగా సత్యవేడు నియోజకవర్గంలో జ్వర బాధితులు రోజురోజుకు అధికమవుతున్నారు.

- ప్రతి ఇంటా జ్వర బాధితులే
- మంచం పట్టిన పల్లెలు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు
- ముందస్తు జాగ్రత్తలపై పట్టని అధికారులు

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని 7 మండలాల్లో 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ ఉండగా వాటికి రోజువారీగా 600 పైచిలుకు జ్వర బాధితులు వైద్యం కోసం వస్తున్నారు. అయితే ప్రస్తుతం వాతావరణం రీత్యా సీజనల్ వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా వైద్య ఆరోగ్యశాఖ ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమయిందని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం నిరీక్షణ

ముస్లిం పాళెంలో డెంగీ కేసు నమోదు

వరదయ్యపాళెం మండలం ముస్లిం పాళెంలో 4 రోజుల కిందట డెంగీ కేసు నమోదైంది. ఆ గ్రామానికి చెందిన యువకుడు నియాజ్ అలీ డెంగీ జ్వరంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్నాడు. ప్రధానంగా ఆ గ్రామంలో మురుగు కాలువలు లేక రోడ్లపైనే మురుగు పారుతోంది. వాటి నుంచి దోమలు వృద్ధి చెంది రాత్రివేళల్లో ఇళ్లలో స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తరచూ ఈ గ్రామం నుంచి స్థానిక ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అయితే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన వైద్య సిబ్బంది డెంగీ కేసు నమోదైన నాలుగు రోజులకు ఆ గ్రామానికి వెళ్లి హడావుడి చేశారు.

ఊసేలేని వైద్య శిబిరాలు

వరదయ్యపాళెం మండలంలో కొద్దిరోజులుగా ఏ గ్రామాన్ని సందర్శించిన పదుల సంఖ్యలో జ్వరంతో బాధపడుతూ కనిపిస్తున్నారు. కొందరికి డెంగీ లక్షణాలు సైతం ఉంటున్నాయి. మండలంలో జ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్నా ఉచిత వైద్య శిబిరాలు , ఫీవర్ సర్వే , మెరుగైన వైద్యం అందించడం గానీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

రాచర్ల, ఎంజీనగర్, పెద్ద పాండూరు, వరదయ్యపాళెం, కదూరు, చిలమత్తూరు గ్రామాల్లో జ్వరాలు విస్తరిస్తున్నాయి. అలాగే బీఎన్‌కండ్రిగ మండలం నెలవాయి, సత్యవేడు మండలంలోని ఇరుగుళం, కొల్లడం ఇలా నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం మండలాల్లో జ్వరాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

తాగునీరు కలుషితం

రెండు వారాలుగా వాతావరణంలో వచ్చిన మార్పు, దీనికి తోడు కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో ఒక్కసారిగా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తాయి. వీధుల్లో నిలిచిపోయిన వర్షపు నీటి నిల్వలతో దోమలు విజృంభిస్తున్నాయి. పల్లెల్లో పూర్తి స్థాయిలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల వద్ద బాత్రూమ్‌ల నుంచి వచ్చే వ్యర్థపు నీటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఈ పరిస్థితులు పల్లెల్లో తీవ్ర ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. అంతేకాక సకాలంలో పంచాయతీ కొళాయిలకు నీటి సరఫరా అయ్యే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రత అంతంత మాత్రంగా చేస్తున్నారు. దీంతో నీరు కలుషితం కూడా ఈ పరిస్థితులకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల్లో లోపించిన సమన్వయం

వైద్యఆరోగ్యశాఖ, ఇటు పంచాయతీ సిబ్బంది సమన్వయ లోపంతో ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమవుతున్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య ఇబ్బందులకు చేపట్టాల్సిన వైద్య సలహాల గురించి సమన్వయం చేసుకుంటే ఈ పరిస్థితులు పునరావృతం అయ్యే పరిస్థితి లేదు. కేవలం సమావేశాలలో మాత్రం సమన్వయంతో ముందుకెళ్లాలని ఉపన్యాసాలు ఇస్తారే తప్ప అవి ఆచరణలో అమలు కావడం లేదు.

గురుకులం ఘటన మరువకముందే..



సత్యవేడు గురుకులంలో జ్వరాలతో చికిత్స పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

నియోజకవర్గంలోని సత్యవేడు ప్రభుత్వ గురుకుల పాఠశాల వసతి గృహంలో ఇటీవల నాలుగు రోజుల కిందట 56 మంది విద్యార్థులు ఒకేసారి అస్వస్థతకు గురై జ్వరాల బారినపడ్డారు. రెండు రోజులుగా వారు క్రమేణా కోలుకుంటున్నారు. ఈ పరిస్థితులు మరువకముందే నియోజకవర్గంలో మళ్లీ గ్రామస్థాయిలో ప్రజలు జ్వరాల బారినపడడం, అది కూడా డెంగీ కేసులు నమోదు కావడంతో ప్రజలు ఉలికిపాటుకు గురవుతున్నారు.

అన్ని రకాల చర్యలు చేపట్టాం



వరదయ్యపాళెం మండలంలోని ముస్లిం పాళెంలో డెంగీ కేసు నమోదైన నేపథ్యంలో అక్కడ వైద్యఆరోగ్యశాఖ పరంగా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నాం. దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేశాం. అలాగే ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరంతో ఉన్న వారికి వైద్యం చేపడుతున్నాం.

–డాక్టర్ ఉదయ్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వరదయ్యపాళెం

గత ప్రభుత్వంలో సురక్ష శిబిరాలు

గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పెద్దఎత్తున ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అన్నిరకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించేవారు. ఉచిత వైద్యశిబిరాల్లో నిపుణులైన వైద్యులతో 14 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.



జగనన్న సురక్ష వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్యులు (ఫైల్)

ఆలయంలో ఈఓ తనిఖీలు



భక్తులతో మాట్లాడుతున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈవో బాపిరెడ్డి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా పడితరం స్టోర్స్‌లో రికార్డులను పరిశీలించి సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. అదే విధంగా నిత్యాన్నదాన సత్రంలో ఆహార నాణ్యతను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. భక్తులను అన్నప్రసాద నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు లేక కర్షకుల కష్టాలు

వరదయ్యపాళెం : మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ ఆరికిచేలుకు వెళ్లే మార్గంలో ఆ గ్రామానికి సమీపంలో ఉన్న వాగు వర్షం వస్తే కోతకు గురవుతోంది. స్థానిక సర్పంచ్ చొరవతో ఈ మార్గంలో తాత్కాలికంగా పైపు కల్వర్టును ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పటికే మూడు పర్యాయాలు తాత్కాలిక పైపు కల్వర్టు కోతకు గురైంది. స్థానిక సర్పంచ్ చొరవతో కోతకు గురైన సమయంలో మరమ్మతులు చేపట్టి రాకపోకలను యథావిధిగా పునరుద్ధరించారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు మరో మారు పైపు కల్వర్టు కోతకు గురైంది. దీంతో రెండు రోజుల కిందట జేసీబీ సాయంతో కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ మార్గంలో లోలెవల్ కాజ్‌వేను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పలుమార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



వడ్డిపాళెంలోని ఆలయంలో నిర్వహించిన స్వామి కల్యాణం

వరదయ్యపాళెం : మండలంలోని చిన్న పాండూరు వడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీ భూమి నీలాదేవి సమేత శ్రీనివాస ఆలయ కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు అభిషేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరణ చేసి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ అర్చకులు శంకరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం , మహేంద్ర, మాధవయ్య, వెంకటేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాధితులకు అండగా ఉంటాం

తిరుపతి తుడా : అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థినులకు అండగా ఉంటామని రాష్ట్ర షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం రుయా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తిరుపతి గిరిజన గురుకుల బాలికల వసతిగృహం విద్యార్థినులను ఆయన పరామర్శించారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని ఆహారం వడ్డించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడిన తర్వాతే ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయాలని సూచించారు.

ప్రాచీన కవుల సేవలు మరువలేం



వారోత్సవాల్లో అధికారులు, విద్యార్థులు

రేణిగుంట : తెలుగు సాహిత్యం ఎంతో మధురమైందని రేణిగుంట గ్రంథాలయాధికారిణి శ్రీముఖి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు ప్రాచీన కవుల గురించి, వారి సాహిత్య కృషిని వివరించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కస్తూరి పాల్గొన్నారు.

సత్యవేడు సీహెచ్‌సీలో అందని మెరుగైన వైద్యం

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యం అందడంలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు ఆరోపించారు. ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడుతో కలసి సత్యవేడు వైద్యశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలలో పేద రోగులకు మెరుగైన వైద్యం అందక పోవడం వల్లే ఆర్ఎంపీల వద్దకు వెళ్లి వైద్యం చేయించుకొంటున్నారన్నారు. సత్యవేడు వైద్యశాలలో ప్రసవం కేసులు తక్కువగా జరుగుతున్నాయని ప్రతి కేసు రెఫర్ చేస్తూ డాక్టర్లు చేతులు దులుపుకొంటున్నారన్నారని విమర్శించారు. వైద్యశాలలో గైనకాలజిస్టు, అనస్తీషియా పోస్టులు భర్తీ చేయక పోవడంతో గర్భిణులు ప్రసవ సమయంలో దూర ప్రాంతాలకు వెళ్లి అవస్థలు పడుతున్నారన్నారు. కంటి వైద్యం చికిత్సకు పరికరాలు లేవన్నారు. నవజాత శిశు కేంద్రాన్ని ఆరు నెలల క్రితం మూసి వేసి సిబ్బందిని బదిలీ చేశారన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ నిర్వహణకు సిబ్బంది నియామకం జరగలేదన్నారు. వైద్యశాలలో సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షకు పూనుకొంటామని హెచ్చరించారు. అనంతరం బాలుర గురుకుల పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో మరుగు దొడ్లు శుభ్రతకు ఒక్కరే ఉండడంతో సమస్య ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రఘునాద్, జిల్లా ట్రెజరర్ వేల్ రెడ్డి, మండల ట్రెజరర్ గురవయ్య, అంజనాద్, మురుగేష్, తమిళ అరసన్ పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన అధికారులు



విమానాశ్రయంలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. నారావారిపల్లెలో సీఎం సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలో పాల్గొనడానికి విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్, డిఐజీ షిమోషి బాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్ రెడ్డి, భానుప్రకాష్, గురజాల జగన్ మోహన్, డా. థామస్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన నారావారి పల్లెకు బయల్దేరి వెళ్లారు.

రాచకండ్రిగలో లోఓల్టేజీ సమస్య

వరదయ్యపాళెం : మండలంలోని రాచకండ్రిగలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. లోఓల్టేజీ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వినియోగదారులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ లేని కారణంగా లోఓల్టేజీ సమస్య తరచూ వేధిస్తోంది.ఈ విషయమై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. 100 కేవీ కెపాసిటీ కలిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వానొస్తే .. భయం భయం

- ఉరుస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు
- తడుస్తున్న రికార్డులు, కంప్యూటర్లు
- శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



ఏర్పేడులో ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం

రేణిగుంట : మండల ప్రజలకు సమస్య వస్తే ఆ కార్యాలయానికి వచ్చి ఏకరవు పెట్టుకుంటారు.. అయితే ఆ కార్యాలయాలకే కష్టం వచ్చి పడింది. చినుకు పడితే కార్యాలయం ఉరుస్తూ ఉద్యోగుల విధి నిర్వహణకు ఆటంకంగా మారుతోంది. ఏర్పేడు తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ భవనాలు దశాబ్దాల కాలం నాటివి కావటంతో శిథిలావస్థకు చేరుకుని ఉరుస్తున్నాయి. వర్షం వస్తే చాలు... పైకప్పు నుంచి వర్షపు నీరు ధారలా కారుతూ కార్యాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు తడిసిపోతున్నాయి. రికార్డుల గది కూడా ఉరుస్తుండటంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఏఎస్‌వో గదిలో కంప్యూటర్లపై కూడా చినుకులు పడుతుండటంతో వాటిపై ప్లాస్టిక్ కవర్లు కప్పారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో నూతన భవన నిర్మాణం సగంలో ఆగిపోయి ఉంది. దానిని పూర్తి చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఆ దిశగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.





కంప్యూటర్‌పై కప్పిన ప్లాస్టిక్ కవర్లు, అర్ధంతరంగా ఆగిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

తిరుపతి కల్చరల్ : లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధుల సమక్షంలో నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ తిరుపతి శ్రీశ్రీనివాస వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులుగా కేసీ లోకేష్, మబ్బువాసుదేవరెడ్డి, కార్యదర్శిగా జగన్నాథం, కోశాధికారిగా బెల్లంకొండ సురేష్, కోర్డినేటర్‌గా డాక్టర్ జి.వంశీ, డైరెక్టర్లుగా ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వర్ ప్రకాష్ బి.రఘు, కమలమ్మ, శాంతి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ మానవసేవే, లయన్స్ క్లబ్ వంటి సంస్థలు పేదల పాలిట పెన్నిధిలా నిలిచి సేవలు అందించడం అభినందనీయమన్నారు. అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణంతో మెలుగుతూ సమాజ శ్రేయస్సుకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లె రహదారులు.. పడిలేస్తేనే ప్రయాణాలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రమైన బుచ్చినాయుడు కండ్రిగలోని వీధుల రోడ్లు గుంతలమయం కావడంతో చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామంలోని పలు వీధుల రోడ్లు బురదమయంగా మారాయి. గ్రామంలోని ఈబీసీ కాలనీ, బీసీ కాలనీ, ప్రసన్న వేంకటేశ్వరస్వామి వీధి, వేంకటేశ్వరకాలనీ వెళ్లే మట్టి రోడ్లు గుంతలమంగా తయారయ్యాయి . వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్లపై నడవటానికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు బురదలో అదుపు తప్పి కింద పడి గాయాల పాలవుతున్నారు. మండల కేంద్రం కావటంతో కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిమెంట్ రోడ్లు వేస్తామన్న నాయకుల మాటలు నీటి మూటలగానే మిగిలాయి. గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం ఉన్నా వీధుల రోడ్లు గుంతలకు మట్టి వేసి పూడ్చిన పాపాన పోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామంలోని వీధుల రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా వేంకటేశ్వర కాలనీ రోడ్డు



అధ్వానంగా బీసీ కాలనీలో రోడ్డు



ప్రసన్న వేంకటేశ్వరస్వామి రోడ్డు దుస్థితి